క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దౌల్తాబాద్: మండల పరిధి సురాయిపల్లి, బాలంపేట సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని ఏఈ మహిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. సురాయిపల్లి సబ్‌స్టేషన్ పరిధి గ్రామాలకు ఉదయం 9గంటల నుంచి 12గంటల వరకు, బాలంపేట పరిధి గ్రామాలకు ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు సరఫరా నిలిపి వేయనున్నట్లు ఏఈ పేర్కొన్నారు. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

శివమాల ధరించిన భక్తులు



ఆలయ ప్రాంగణంలో శివ భక్తులు

కుల్కచర్ల: మండల పరిధి కుల్కచర్ల తదితర గ్రామాలకు చెందిన శివ భక్తులు ఆదివారం బండవెల్కిచర్ల పరిధి శ్రీ పాంబండ రామలింగేశ్వర దేవస్థానంలో శివమాల ధరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. మాలధారణ అత్యంత పవిత్రమైందని తెలిపారు.

సీఎంను కలిసిన నాయకులు



సీఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

దౌల్తాబాద్: కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. అనంతరం మండల పరిధి సమస్యలను సీఎంకు వివరించారు. రేవంత్‌ను కలిసిన వారిలో సర్పంచ్‌లు రెడ్యానాయక్, నాగేందర్ సింగ్, నాయకులు చెన్నకేశవులుగౌడ్, మాధవ రెడ్డి, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం



సోమ్లను సన్మానిస్తున్న సమాఖ్య ప్రతినిధులు

అనంతగిరి: పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ కేతావత్ సోమ్లు నాయక్‌ను ఆదివారం అఖిల భారత గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రతినిధులు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఘనంగా సన్మానించారు. అనంతరం సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాఘవన్ నాయక్ మాట్లాడారు. సోమ్లుకు అవార్డు రావడం పట్ల బంజార ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సైంటిస్ట్ పిక్లానాయక్, ప్రధాన కార్యదర్శులు సురేష్‌నాయక్, అఖిలేష్ నాయక్, కన్వీనర్ వినయ్ పవార్, గోవింద్ నాయక్, వైస ఎంపీపీ విజయ్‌కుమార్, ఎండీ సద్దాం తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న డీఎస్పీ శేఖర్‌గౌడ్ తదితరులు

తాండూరు రూరల్: మండల పరిధి గుంతబాసుపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని డీఎస్పీ శేఖర్‌గౌడ్ ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం చేర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని కొనియాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గాడి మంజుల, సర్పంచ్ జగదీష్, వైస్ ఎంపీపీ స్వరూప రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రవిగౌడ్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మురళీకృష్ణ, నాయకులు మల్లప్ప, ఇస్మాయిల్, గోవింద్‌లు పాల్గొన్నారు.

ఘనంగా మైసమ్మ బోనాలు



ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

పూడూరు: మైసమ్మతల్లి బోనాల పండుగ ఘనంగా జరిగింది. ఆదివారం మండల పరిధి పోలిరెడ్డిగుడలో గ్రామస్తులు మైసమ్మకు బోనమెత్తారు. డప్పుచప్పుళ్ల నడుమ పోతురాజుల విన్యాసాలతో ఊరేగింపుగా తరలివెళ్లారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి, తల్లికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జయమ్మ, నాయకులు చెన్నయ్యగౌడ్, సరస్వతి, శ్రీశైలం, రాజు, జంగయ్య, కృష్ణ, అనంతయ్య పాల్గొన్నారు.

పంచాయతీల్లో ప్రత్యేక పాలన!

మరో మూడు రోజుల్లో సర్పంచుల పదవీ కాలం ముగియనున్న నేపథ్యంలో.. గ్రామ పాలకులు ముందస్తుగానే పదవీ విరమణ చేస్తున్నారు. పదవీ కాలాన్ని ప్రభుత్వం పొడిగిస్తుందన్న ఆశ సన్నగిల్లడంతో పలువురు నిరాశతో వీడ్కోలు చెబుతుండగా.. ప్రత్యేక పాలనకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. అందుకు అధికారుల జాబితాను సిద్ధం చేస్తోంది.

- మూడురోజుల్లో ముగియనున్న సర్పంచుల పదవీకాలం
- సార్వత్రిక ఎన్నికల తర్వాతే పల్లెపోరుకు సిద్ధం



గోకఫసల్‌వాద్ పంచాయతీ కార్యాలయం

దౌల్తాబాద్: స్థానిక సంస్థల ఎన్నికలు ఆలస్యమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఫిబ్రవరి 1తో ప్రస్తుత సర్పంచుల పదవీకాలం ముగియనుండగా.. ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి పంచాయతీ ఎన్నికల గురించి స్పష్టత లేకపోవడంతో ఇక ప్రత్యేక పాలనే అనివార్యం అన్నట్లు తెలుస్తోంది. దీంతో ఇప్పటివరకు పదవీకాలం పొడిగిస్తుందన్న ఆశతో స్థానిక పాలకులు.. తీవ్ర నిరాశతో తమ పదవులకు ముందుస్తుగా వీడ్కోలు పలుకుతున్నారు. ఇదిలా ఉండగా.. ప్రత్యేక పాలనకు సంబంధిత ఉన్నతాధికారులు ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడమే ఆలస్యం అన్నట్లుగా.. ముందుకు సాగుతున్నారు. మండల స్థాయి, గెజిటెట్ అధికారు లు, సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్లు క్యాడర్ ఉద్యోగుల సమాచారం సేకరిస్తున్నట్లు తెలుస్తోంది.

పర్సన్ ఇన్‌ఛార్జిలకు అవకాశం లేదు

నూతన పంచాయతీరాజ్ చట్టం ప్రకారం నిర్దేశిత గడువులోగా ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. లేదంటే ప్రత్యేక అధికారులను నియమించి, పాలన కొనసాగించాల్సింటుంది. పదవీకాలం పూర్తయిన తరువాత ఆయా పాలకవర్గాలను పర్సన్ ఇన్‌ఛార్జిలుగా కొనసాగించేందుకు కొత్త చట్టం అనుమతించడంలేదు. అలా వారిని నియమించాలంటే అసెంబ్లీలో చట్ట సవరణ లేదా ఆర్డినెన్స్‌ను తేవాల్సి ఉంటుంది. కానీ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేకతకే మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తుంది.

సార్వత్రిక ఎన్నికల తర్వాతే పల్లెపోరు

రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్.. లోక్‌సభ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఆ దిశగానే ముందుకు సాగుతోంది. మెజార్టీ స్థానాలను కైవసం చేసుకునేందుకు కార్యాచరణ సిద్ధం చేసుకుంది. ఆరు గ్యారంటీల అమలుకు దరఖాస్తులు స్వీకరించిన విషయం తెలిసిందే. అందులో భాగంగానే పార్లమెంట్ ఎన్నికల తరువాతే పంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను ఏక కాలంలో జరిపేందుకు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం.

వార్డు సభ్యులకు వీడ్కోలు



వార్డు మెంబర్లకు వీడ్కోలు పలికిన సర్పంచ్ చంద్రమౌళి

ధారూరు: ఫిబ్రవరి 1వ తేదీతో జీపీ పాలక వర్గం పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో బరువెక్కిన గుండెలతో సభ్యులు తమ పదవులకు వీడ్కోలు పలుకుతున్నారు. ఆదివారం ధారూరు పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో వార్డు సభ్యులకు సర్పంచ్ చంద్రమౌళి, ఉప సర్పంచ్ లింగనపల్లి రాజేశ్వర్‌లు శాలువాలతో సన్మానించి వీడ్కోలు పలికారు.

సమ్మెను విజయవంతం చేయండి

సీఐటీయూ రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి దేవేందర్



శంకర్‌పల్లి గ్రామ పంచాయతీ యూనియన్ నూతన కార్యవర్గం

శంకర్‌పల్లి: ఫిబ్రవరి 16వ తేదీన నిర్వహించబోయే దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా సహాయక కార్యదర్శి అల్లి దేవేందర్, రైతు సంఘం నాయకులు ఏనుగు మల్లారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం శంకర్‌పల్లి అతిథి గృహంలో సీఐటీయూ ఆధ్వర్యంలో శంకర్‌పల్లి మండల కార్మికులతో సమావేశం నిర్వహించారు. అనంతరం మండల గ్రామ పంచాయతీ కార్మికసంఘం నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. మండల గ్రామ పంచాయతీ యూనియన్ అధ్యక్షుడిగా రాజు, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్, కోశాధికారిగా సుజాత, ఉపాధ్యక్షుడిగా ప్రభాకర్‌ను ఎనుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో బీజేపీ ప్రభుత్వం మతోన్మాద కార్మిక వ్యతిరేఖ విధానాలను అవలంబిస్తుందన్నారు. రైతు వ్యతిరేఖ విధానాలపై ఫిబ్రవరి 16వ తేదీన సంయుక్త కిసాన్ మోర్చ ఆధ్వర్యంలో సమ్మె నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఈ సమ్మెకు కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నరసింహ, లక్ష్మీ, ఉమ, స్వప్న, ప్రవీణ, మంగమ్మ, యాదమ్మ, పద్మారాణి తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్

షాద్‌నగర్: సంత్ సేవాలాల్ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని గిరిజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని టీచర్స్ కాలనీలోని సంత్ సేవాలాల్ దేవాలయంలో ఆలయ కమిటీ సమావేశాన్ని శ్రీను నాయక్, రాంసింగ్ నాయక్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ అని పేర్కొన్నారు. గిరిజన జాతి కోసం, ఐక్యత కోసం ఎంతో కృషి చేశారని గుర్తు చేసుకున్నారు. ఫిబ్రవరి 15న సేవాలాల్ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించి, సెలవు దినంగా ప్రకటించాలని గిరిజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రఘు నాయక్, నారాయణ శంకర్, గోపాల్ నాయక్, లక్ష్మణ్ నాయక్ తదితరులు ఉన్నారు.

ఆర్థిక సహాయం

దోమ: మండల పరిధి మోత్కూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత ఎడ్ల చెన్నయ్య కుమారుడు వినోద్ అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కేఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ శరత్‌కుమార్ రెడ్డి అంత్యక్రియల్లో పాల్గొని, మృతదేహానికి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, తక్షణ ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కేశవులు, గ్రామస్తులు రామకృష్ణధనేశ్వర్, ఆనంద్, లింగయ్య, ఇంద్రసేన్, కండక్టర్ మల్లయ్య, నర్సింహులు, రవికుమార్, బాల్‌రాజ్, దోమ నర్సింహులు, వెంకటయ్య, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మల్లన్న జాతర



జాతరలో పాల్గొన్న నాయకులు, మహిళలు

మొయినాబాద్ రూరల్: అమ్డాపూర్ గ్రామంలో మల్లన్న బోనాల జాతర అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనం ఎత్తుకొని ర్యాలీగా బయలుదేరారు. శివసత్తుల పూనకాలు, డప్పుల దరువు, పోతురాజుల విన్యాసాలు చూపరులను ఆకట్టుకున్నాయి. గ్రామ శివారులోని మల్లన్న స్వామికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మల్లన్న స్వామిని దర్శించుకునేందుకు భక్తులు ఉదయం నుంచి సాయంత్రం వరకు బారులు తీరారు. జంట నగరాలతో పాటు ఆయా ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. దీంతో అమ్డాపూర్ గ్రామం భక్తులతో సందడిగా మారింది. కార్యక్రమంలో సర్పంచ్ రవళిగోపికృష్ణారెడ్డి, ఉపసర్పంచ్ వడ్ల నాగార్జున చారి తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఎన్నికలు జరిగే వరకే రాజకీయాలు



సర్పంచ్ నర్సింహారెడ్డికి తులాభారం చేస్తున్న గ్రామస్తులు



వీడ్కోలు సమావేశంలో పాలక సభ్యులను సన్మానిస్తున్న గ్రామస్తులు

- గ్రామాభివృద్ధికి సమష్టిగా ముందుకు సాగాలి
- పదేళ్ల కాలంలో గ్రామస్తుల సహకారం మరువలేనిది
- వీడ్కోలు సమావేశంలో సర్పంచ్ నర్సింహారెడ్డి

మోమిన్‌పేట: ఎన్నికలు జరిగే వరకే రాజకీయాలు ఉండాలని, అనంతరం గ్రామాభివృద్ధే లక్ష్యంగా సమష్టిగా ముందుకు సాగాలని సర్పంచ్ నర్సింహారెడ్డి సూచించారు. ఆదివారం మోమిన్‌పేట మండలం చీమల్‌ధరి గ్రామంలో సర్పంచ్, వార్డు సభ్యుల పదవీ విరమణ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పాలన సభ్యులను శాలువాలతో సన్మానించారు. సర్పంచ్‌కు తులాభారం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడారు. సర్పంచిగా ఎన్నికైన ఈ పదేళ్ల కాలంలో ప్రజల సహకారం మరువలేనిదని చెప్పారు. గ్రామంలో రూ.7కోట్లకు పైగా చేపట్టిన అభివృద్ధి పనుల్లో గ్రామస్తుల భాగస్వామ్యం ఎనలేనిదని చెప్పారు. ఫిబ్రవరి 1తో సర్పంచ్‌ల పదవీకాలం ముగుస్తుందని, అనంతరం ప్రత్యేకాధికారుల పాలన రానుందని, వారికీ ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మానస, కార్యదర్శి సుగుణ, వార్డు సభ్యులు, ఏఎంసీ చైర్మన్ శ్రీకాంత్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఆలయ చైర్మన్ మైపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకట్, యువజన సంఘం నాయకులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఉన్నారు.

రెవెన్యూ సదస్సులతోనే సమస్యలు పరిష్కారం

ఎంపీపీ విజయలక్ష్మి

చేవెళ్ల: రెవెన్యూ సదస్సులతోనే ధరణి సమస్యలకు పరిష్కారం లభిస్తుందని చేవెళ్ల ఎంపీపీ ఎం విజయలక్ష్మిరమణారెడ్డి పేర్కొన్నారు. చేవెళ్ల మండలకేంద్రంలో ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ధరణి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కమిటీలు అంటూ కాలయాపన చేయొదన్నారు. దీని వల్ల సమయం వృథా అవుతుందే తప్పా పరిష్కారం లభించదన్నారు. అందుకే ఈ విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. గ్రామాల వారీగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తే గ్రామాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అక్కడే పరిష్కారానికి అవకాశం ఉంటుందన్నారు. ప్రజల వద్దకే పాలన తీసుకపోయేవిధంగా ప్రభుత్వం దృష్టి పెట్టాలన్నారు. ప్రస్తుతం జిల్లా స్థాయిలో కలెక్టర్ ధరణి సమస్య పరిష్కారం చేయటం సాధ్యం కాదని చెప్పారు. ఈ విషయంలో వికేంద్రీకరణ చేసి మండల స్థాయిలోనే సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

తీరు మారేనా?



చనువెళ్లిలో మూతపడ్డ పశువైద్యశాల సబ్‌సెంటర్

సిబ్బంది లేక మూతపడిన పశువైద్యశాల

- మూగజీవాలకు అందని వైద్యం
- పశువులను విక్రయిస్తున్న రైతులు
- పట్టించుకోని ఉన్నతాధికారులు
- కొత్త ప్రభుత్వం వైపు పాడిపోషకుల ఎదురు చూపులు

చేవెళ్ల: సుమారు ఎనిమిదేళ్లుగా పశువైద్యశాఖలో ఉన్న ఖాళీపోస్టులు భర్తీకి నోచుకోవడం లేదు. ఫలితంగా నియోజకవర్గంలోని పలు మండలాల్లో పశువైద్యశాలలు(సబ్ సెంటర్లు) క్రమంగా మూతపడుతున్నాయి. దీంతో గ్రామీణ ప్రాంతంలో పశువైద్యం గాలిలో దీపంలా మారింది. పశువులకు సకాలంలో వైద్యం అందకపోవడంతో అవి మృత్యువాత పడుతున్నాయి. దీంతో గత్యంతరం లేక వాటిని అమ్ముకుంటున్నారు. గతంతో పోలిస్తే మండలంలో భారీగా పశుపోషణ తగ్గింది. రంగారెడ్డి చేవెళ్ల మండలంలో పశువైద్యానికి సిబ్బంది కొరత ఉండడంతో ఏడు సబ్‌సెంటర్లను మూసివేయగా.. ఆ భవనాలు ప్రస్తుతం శిథిలావస్థలో చేరుకున్నాయి. ఈ విషయాన్ని పట్టించుకునే నాథుడే కరువయ్యారని రైతులు ఆరోపిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎలాంటి స్పందన లేకపోవడంతో ఇప్పుడు కొత్తగా ఏర్పడిన ప్రభుత్వంలోనైనా పశువైద్యం గాడిన పడుతుందో లేదోనని వారు ఎదురు చూస్తున్నారు. గత ప్రభుత్వం పాడి పరిశ్రమ పెంచడానికి ఆసక్తి చూపించింది. దీంతో గొర్రెల పంపిణీ వంటి కార్యక్రమాలను కూడా చేపట్టింది. ఈ క్రమంలోనే పశువైద్యానికి సహకారం ఇస్తారని ఎదురుచూసిన రైతుల ఆశలు ఆడియాశలయ్యాయి. కొత్తగా వైద్యశాలలు ఏర్పాటు చేయకపోయినా.. ఉన్నవాటినైనా కొనసాగిస్తారని ఎదురు చూసినా ఫలితం లేకపోవడంతో పశువుల పోషణ ఎలా ఉన్నా.. వాటి ఆరోగ్యం విషయంలో ఆందోళన చెందుతున్నామని పశు కాపరులు ఆందోళన చెందుతున్నారు. మండల పరిధిలోని 37 పంచాయతీల్లో ప్రజలు ఎక్కువగా వ్యవసాయం, పశుపోషణపైనే ఆధారపడి జీవిస్తున్నారు. చాలా మంది పశువులు, మేకలు, గొర్రెలను పోషించుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. వాటికి ఏదైనా రోగం వస్తే వైద్యం అందించేందుకు వైద్యులు ఎక్కువగా లేరు. దీంతో చేసేదిలేక వాటిని అమ్ముకోవటం తప్పడం లేదని వాపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ఈ విషయంలో స్పందించి మండలంలో పశువైద్యసిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని కోరుతున్నారు.

మూతపడిన ఏడు సబ్‌సెంటర్లు

చేవెళ్ల మండలంలో ఆవులు 4,684, బర్రెలు 4,128, గొర్రెలు 22,894, మేకలు 7,835 ఉన్నాయి. కొన్నేళ్ల కిత్రం ఉన్న పశువులతో పోలిస్తే సగానికిపైగా పశువులు తగ్గిపోయాయి. మండలంలో పశువైద్యం అందించేందుకు ఆలూరు, పలుగుట్టలలో ప్రైమరీ వెటర్నీ సెంటర్లు, చేవెళ్లలో పశువైద్యశాల ఉన్నాయి. వీటితోపాటు మండలంలో ఏడు సబ్‌సెంటర్లు కౌకుంట్ల, తంగడపల్లి, ఖానాపూర్, కమ్మెట, ముడిమ్యాల, చనువెళ్లి, గుండాల గ్రామాల్లో ఉన్నాయి. గతంలో ఈ సబ్‌సెంటర్లలో సిబ్బంది ఉండడంతో గ్రామాల్లో వైద్యం మెరుగైన సదుపాయం అందుబాటులో ఉండేది. ప్రస్తుతం మండలంలోని ఉన్న సబ్‌సెంటర్లలో ఏ ఒక్క వైద్యుడు, సిబ్బంది లేకపోవడంతో ఆయా వైద్యశాలలు మూతపడ్డాయి. కేవలం చేవెళ్ల, ఆలూరు, పలుగుట్టలలోని ప్రైమరీ వెటర్నీ సెంటర్లలో ఒకరిద్దరితోనే పశువు వైద్యం అందుబాటులో ఉంది.

సిబ్బంది లేక ఇబ్బంది



పేరుకే పశువైద్యశాల ఉంది. కానీ ఎప్పుడు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండటం లేదు. ఎప్పుడు అడిగినా మరో గ్రామంలో ఉన్నారని చెబుతారు. పాడి పశువులకు సకాలంలో వైద్యం అందించే సిబ్బందిలేక ఇబ్బందులు పడుతున్నాం. గతంలో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండే వారు. కొన్నేళ్లుగా వారు గ్రామాలకు రావడం లేదు. కొత్త ప్రభుత్వంలో నైనా పశువైద్యం మెరుగు పడుతుందని ఆశిస్తున్నాం. గ్రామాల్లో ఉన్న సబ్‌సెంటర్లలో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలి.

– వీరేశం, రైతు, కుమ్మెర

మూగజీవాలపై నిర్లక్ష్యం



మూగజీవాలు కాబట్టే వాటికి ఏదైనా వ్యాధి సోకితే చెప్పుకోలేవు. వాటి విషయంలో ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. మండలంలో పేరుకే పశువైద్యశాలలు ఉన్నట్లుగా కనిపిస్తున్నాయి. మండల కేంద్రంలో ఒక్కటే వైద్యశాల ఉండడంతో గ్రామాల నుంచి పశువులను ఇక్కడికి తీసుకురాలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో మాదిరిగా సబ్‌సెంటర్లలో వైద్యం అందుబాటులో ఉంటే బాగుంటుంది.

– వెంకటేశ్, రైతు, పామెన

ఏడు సబ్‌సెంటర్లు మూత



మండల పరిధి గ్రామాలకు సంబంధించి సరిపడా పశువైద్య సిబ్బంది లేకపోవడంతో ఉన్నవారికి పనిభారం ఎక్కువయింది. ఉన్న సిబ్బందితో ఏ గ్రామంలో పశువులకు ఎటువంటి అనారోగ్య సమస్య తలెత్తిందని తెలిసినా.. అక్కడికే వెళ్లి వైద్య చికిత్స అందిస్తున్నాం. సిబ్బంది లేక ఏడు సబ్‌సెంటర్లు మూతపడ్డాయి. మొబైల్ పశువైద్య వాహనం ద్వారా నియోజకవర్గంలోని పశువులకు పశువైద్య సేవలు అందిస్తున్నాం. ప్రభుత్వం వైద్యులను, సిబ్బందిని నియమిస్తే.. అన్ని సబ్‌సెంటర్లు తెరుచుకుంటాయి. వైద్య సేవలు మెరుగు పడతాయి.

– తిరుపతిరెడ్డి, పశువైద్యుడు, చేవెళ్ల

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ రూరల్: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని మొండోనిరాయి తండాలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ఆదివారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ప్రజా ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారన్నారు. కాంగ్రెస్ పేదల ప్రభుత్వమని చెప్పారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి పెద్ద పీట వేస్తున్నట్లు తెలిపారు. గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు తగిన కృషి చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ వెంకట్‌రాం రెడ్డి, బాబర్‌ఖాన్, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, బుజ్జిబాబు నాయక్, బాల్‌రాజ్‌గౌడ్, దేవీహన్యా నాయక్, శ్రీను నాయక్, నెహ్రూనాయక్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



నందిగామ: క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

నందిగామ: యువకులు, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల కేంద్రమైన నందిగామలో 'నందిగామ ప్రీమియర్ లీగ్' క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం చదువు మాత్రమే కాకుండా ఆటల్లో ప్రతిభ చూపాలని పేర్కొన్నారు. గ్రామీణా ప్రాంతల్లో నిర్వహించే ఇలాంటి పోటీలతో క్రీడాకారుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని ప్రదర్శించే అవకాశం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రియాంక, మాజీ జెడ్పీటీసీ శ్యాంసుందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ శివ శంకర్ గౌడ్, ఎంపీటీసీలు కొమ్ము కృష్ణ, దేపల్లి కుమార్ గౌడ్, చంద్రపాల్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జంగ నర్సింహ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామస్వామి



సభ్యత్వ కార్డులను అందజేసిన రామస్వామి

చేవెళ్ల: సీపీఐని గ్రామస్థాయిలో బలోపేతం చేయాలని రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యుడు కె. రామస్వామి పిలుపునిచ్చారు. చేవెళ్ల మండల కేంద్రం ఆర్‌అండ్‌బీ అతిథిగృహం వద్ద ఆదివారం మండల కార్యవర్గ సమావేశం కార్యదర్శి సత్తిరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రామస్వామి మాట్లాడుతూ సీపీఐ ఏర్పడి 99 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా పార్టీ సభ్యత్వ నమోదును పెద్ద ఎత్తున చేపట్టాలని చెప్పారు. అనంతరం పార్టీ సభ్యత్వ కార్డులను అందజేశారు. గ్రామ గ్రామాన పార్టీ జెండాలను ఎగురవేయాలన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 1, 2, 3వ తేదీల్లో హైదరాబాద్‌లోని మగ్దూం భవన్‌లో జాతీయ కౌన్సిల్ సమావేశాలు నిర్వహించనున్నారని ఆయన చెప్పారు. 4వ తేదీన ఉదయం 10 గంటలకు బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమాలకు చేవెళ్ల నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు పార్టీ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు తరలి రావాలన్నారు. ఇందులో ఎం.ప్రభులింగం, వడ్ల సత్యనారాయణ, ఎండీ మక్బుల్ ఉన్నారు.